సాక్షి జగిత్యాల

సోమవారం । 4 । నవంబర్ । 2024



ధర్మపురిని దర్శిస్తే ..

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో ఆదివారం అర్చకులు యమ ద్వితీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

8లో▸



6 గంటలు.. 72 పాటలు

కరీంనగర్‌కు చెందిన ప్రముఖ గాయకురాలు సల్వాజీ సంధ్య ఆరు గంటల్లో 72 పాటలు పాడి ఐదు రికార్డు బుక్కుల్లో చోటు సంపాదించింది.

8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/21.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కాకతీయ కాలువకు నీటి విడుదల తగ్గింపు



కాకతీయ కాల్వకు తక్కువగా విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను ఆదివారం తగ్గించారు. ఇప్పటివరకు ఐదు వేల క్యూసెక్కులకు పైగా నీరు విడుదల చేయగా.. దానిని 2,883 క్యూసెక్కులకు తగ్గించారు. ఎస్సారెస్పీలోకి కొనసాగుతోంది. అలాగే ఎస్కేప్ గేట్ల ద్వారా 500 క్యూసెక్కుల నీరు, లక్ష్మీ కెనాల్‌కు 100, మిషన్ భగీరథకు 231, సరస్వతి కెనాల్‌కు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

సావిత్రిబాయి పూలే విగ్రహం ఆవిష్కరణ



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): చదువుల తల్లి సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచిపోయారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని వర్షకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సావిత్రిభాయి విగ్రహాన్ని కొద్దిరోజుల క్రితం దుండగులు ధ్వంసం చేశారు. దీంతో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తన సొంత నిధులతో అదే స్థానంలో మళ్లీ కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. సదరు విగ్రహాన్ని చెన్నయ్యతో కలిసి ఆదివారం విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు. విగ్రహాల ధ్వంసం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. చెన్నయ్య మాట్లడుతూ విగ్రహం ధ్వంసం చేసినప్పుడు తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా దుండగులను ఇప్పటికీ పట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఏలేటి చిన్నారెడ్డి, అంబేడ్కర్ యువజనసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కామన్ స్కూల్ విధానం అమలు చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్



కౌన్సిల్ సమావేశంలో టీపీటీఎఫ్ నాయకులు

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో కామన్ స్కూల్ విద్యావిధానం అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ తెలిపారు. టీపీటీఎఫ్ మూడో జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని డీసీఈబీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు భోగ రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. పదోన్నతులు, బదిలీలు మినహాయించి ప్రభుత్వం ఏమీ చేయడం లేదన్నారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే కేవలం ఒక్క డీఏ మంజూరు చేయడం, అది కూడా వాయిదాల పద్ధతిలో ఇస్తామనడం ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఒకే విధమైన విద్య కావాలని, కామన్ స్కూల్ విద్యావిధానం ద్వారానే అది సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొక్కుల రాంచంద్రం, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల గోవర్దన్, ఉపాధ్యక్షుడిగా సత్యప్రకాశ్, సీహెచ్.సత్యం, గండి రాజయ్య, ఎలిగేటి సంజీవరాణి, చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

కొండగట్టులో సినీ నటుడు కిరణ్ అబ్బవరం పూజలు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో సినీ నటుడు కిరణ్ అబ్బవరం ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామివారి దర్శించుకునేందుకు వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

ఇళ్ల నిర్మాణం.. ఇష్టారాజ్యం

'ఇది జిల్లా కేంద్రంలోని వాణినగర్ చౌరస్తాలో నిర్మిస్తున్న భవనం. బల్దియా నిబంధనలకు విరుద్ధంగా ఈ భవనం సెల్లార్‌లో షట్టర్ నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు'.



'ఇది ధరూర్ క్యాంపు రామాలయం సమీపంలోని వినాయకనగర్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్. ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా బిల్డర్ అపార్టుమెంట్ నిర్మించిన ప్లాట్ విక్రయించినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు'.





'ఇవి జగిత్యాలలోని 9వ వార్డులో ఇండిపెండెంట్ ఇళ్లు. ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణం పేరిట అనుమతులు పొంది వాటి ముందు గేటు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని బల్దియా అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇలా ఇవే కాదు.. పట్టణంలో అనేక అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలున్నాయి.



నాలాను ఆక్రమించి నిర్మించిన ఇల్లు

- సెల్లార్లలో షట్టర్లు.. సెట్‌బ్యాక్ లేని నిర్మాణాలు
- నిబంధనల అమలెక్కడ..?
- కొరవడిన నియంత్రణ
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

జగిత్యాలటౌన్: నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. మరి కొన్ని చోట్ల రోడ్లు, నాలాలను ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. సెల్లార్లను పార్కింగ్ తదితర నాన్ కమర్షియల్ అవసరాలకే వినియోగించాలనే బల్దియా నిబంధనలకు ఉంది. అందుకు విరుద్ధంగా సెల్లార్లలో షట్టర్లు నిర్మిస్తున్నా అధికారుల నియంత్రణ కరువైంది. అంతేకాకుండా అనుమతులు పొంది నిర్మించిన గృహ సముదాయాల ఎదుట గేటెడ్ కమ్యూనిటీని తలపించేలా గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. జగిత్యాల బల్దియాలోని 48 వార్డుల్లో పలు చోట్ల నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నా నియంత్రణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలను నియంత్రించాలని కోరుతున్నారు.

ఉత్తుత్తి కూల్చివేతలు

జగిత్యాల బల్దియాలో అక్రమ నిర్మాణాల పేరిట జరుగుతున్న కూల్చివేతలు ప్రహసనంగా మారుతున్నాయి. నామమాత్రంగా అక్కడక్కడ సెట్ బ్యాక్ లేని నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు కొద్ది రోజుల విరామం తర్వాత తిరిగి అదే స్థితిలో నిర్మించుకునేందుకు అనుమతి ఇస్తుండటం అనుమానాలకు తావిచ్చేలా ఉందని ఆయా వార్డుల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు అమలుచేయాలి



ఆన్‌లైన్‌లో అనుమతి పొందిన ఇళ్ల యజమానులు సెట్ బ్యాక్ నిబంధలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తుండటంతో రోడ్లు కుచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అనుమతులు మంజూరు చేస్తున్న అధికారులు నిబంధనల మేరకు నిర్మాణం జరిగేలా పర్యవేక్షణ చేయాలి.

– పాలకుర్తి రమేశ్, జగిత్యాల

అతిక్రమిస్తే చర్యలు



ఇంటి యజమానులు, బిల్డర్లు నిర్దేశిత సెట్ బ్యాక్ నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలి. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వారికి నోటీసులు జారీ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– చిరంజీవి, జగిత్యాల మున్సిపల్ కమిషనర్

సీసీఐ కఠిన నిబంధనలు

- పత్తి దళారుల పాలు
- తక్కువ ధరకే గ్రామాల్లో అమ్ముకుంటున్న రైతులు



కొడిమ్యాల పరిధిలో పత్తి ఏరుతున్న కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ.7,521 కనీస మద్దతు ధర కల్పించినా, ఆ ధర మాత్రం జిల్లాలో ఏ రైతుకూ అందని దుస్థితి నెలకొంది. జిల్లాలో ఏకైక కొనుగోలు కేంద్రం సీసీఐ ద్వారా వెల్గటూర్‌లో ఏర్పాటు చేసినా ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో జిల్లా రైతులు రవాణా సౌకర్యాన్ని బట్టి వేములవాడ, కరీంనగర్, జన్నారం, నిర్మల్‌లోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకెళ్తున్నారు. అయితే సీసీఐ నిబంధనలు కఠినంగా అమలు చేస్తుండటంతో, గ్రామాల్లోని దళారులకు క్వింటాల్‌కు రూ.1,000–1,500 తక్కువకు విక్రయిస్తూ నష్టపోతున్నారు.

ఈ సారి అంతంతే..

జిల్లాలో ఈసారి పత్తిని దాదాపు 19 వేల ఎకరాల్లో వేశారు. అందులో ఎక్కువగా ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, మల్యాల, కొడిమ్యాల, గొల్లపల్లి మండలాల్లో సాగు చేశారు. ఈ సారి విత్తనాలు వేసినప్పటి నుంచి పత్తి ఏరే వరకు అధిక వర్షాలతో సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టలేక, తెగుళ్ల విజృంభణతో దిగుబడులు తగ్గాయి. దీంతో ఎకరాకు 10–12 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే 8 క్వింటాళ్లకు పడిపోయాయి. ఈ మేరకు జిల్లాలో 1.84 లక్షల క్వింటాళ్లకు గాను, 1.47 లక్షల క్వింటాళ్ల దిగుబడి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిబంధనలపై కన్నెర్ర

సీసీఐ నిబంధనలు కఠినంగా అమలు చేయడంపై రైతులు కన్నెర్ర చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తేమ శాతం ఎక్కువగా ఉందంటూ, పింజ పొడవు సరిగా లేదని, వర్షాలతో దూది రంగు కొంత మారిందని లేనిపోని నిబంధనలతో కొనుగోలుకు సీసీఐ ససేమిరా అంటుంది. పత్తి పింజ పొడవు అనేది 80 శాతం విత్తన జన్యు ప్రభావంపై, కేవలం 20 శాతం మాత్రమే భూమి స్వభావం, యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుందని రైతులు వాపోతున్నారు. మొదటి సారి ఏరిన పత్తి గింజ పొడవు కొంత ఎక్కువ, రెండోసారి ఏరినప్పుడు గింజ పొడవు 34 మిల్లీ మీటర్లే ఉంటుందని, తర్వాత ఏరిన పత్తి గింజ పొడవు తగ్గుతూ వస్తుందని చెబుతున్నారు. అయితే సీసీఐ అధికారులు మాత్రం పత్తి గింజ పొడవు తప్పనిసరిగా 26 మి.మీ ఉంటేనే మద్దతు ధర ఇస్తామని చెబుతుండటం ఎంతవరకు సమంజసమంటున్నారు. దీని ప్రకారం రైతులు మొదటి, రెండో విడత ఏరిన పత్తిని మాత్రమే సీసీఐకి అమ్ముకునే వెసులుబాటు ఉండగా, తర్వాత ఏరిని పత్తిని ఏదో ఓ రేటుకు దళారులకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

దళారులు కూడా కొనని పరిస్థితి..

దళారులు సైతం నాణ్యత లేని పత్తిని కొనమని చెబుతున్నారు. కొంతమంది రైతులు పత్తికి నీటిని అందించి రెండుమూడు విడతల్లో ఏరుకోవాలని భావించినా 120 రోజుల తర్వాత పత్తి నాణ్యత తగ్గిపోయే అవకాశం ఉంది. దీంతో దళారులు, ప్రైవేట్ వ్యాపారులు కొనలేమని చెబుతున్నారు. అయితే, బీటీ పత్తి విత్తనాల్లో మొదటి మూడు పత్తి ఏరుకునే దశల్లో పింజ పొడవు 26– 34 మి.మీ ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, విత్తన సంస్థలు ఎక్కడా ధ్రువీకరించలేదు. సీసీఐ తన నిబంధనలను సవరించలేక, ఆ నెపాన్ని రైతులపై నెడుతూ పత్తి నాణ్యత లేదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

నిబంధనలు సడలించాలి



సీసీఐ నిబంధనలను సడలించాలి. పింజ పొడవు, పోగు దృఢత్వం, దుమ్ము, ధూళి కలయిక శాతంలో వెసులుబాటు ఇవ్వాలి. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– వెల్ముల రాంరెడ్డి, వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు, పూడూరు, కొడిమ్యాల

ఈసారి తీవ్ర నష్టం



ఈసారి అధిక వర్షాలతో పత్తి రైతులకు త్రీవ నష్టం జరిగింది. నకిలీ విత్తనాలు, అనావృష్టితో ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడి తగ్గింది. నిబంధనలు సవరించి రైతులను ఆదుకోవాలి.

– గద్దం సత్యనారాయణ రెడ్డి, జగిత్యాల జిల్లా ఉత్తమ రైతు, ధర్మపురి

సామాజిక సేవలో ముందుండాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- రెడ్‌క్రాస్ సొసైటీ, ఆపి ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాలరూరల్: వైద్యులు సామాజిక సేవలో ముందుండాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం గుత్రాజ్‌పల్లిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆపి ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల డయాగ్నిస్టిక్‌లో 135 మంది రోగులకు రోజు ఉచిత పరీక్షలు జరుగుతాయని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ మంచాల కృష్ణ, ప్యాక్స్ చైర్మన్ సందీప్‌రావు, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ సభ్యులు టీవీ. సూర్యం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయపాల్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ వైద్యసిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

మెట్‌పల్లి(కోరుట్ల): మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రన్, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని మహాజన్ గార్డెన్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతోపాటు ఇంట్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఉస్మాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పడిపోతున్న భూగర్భజలం

- 2.88 మీటర్ల లోతుకు నీరు
- గత నెలతో పోల్చితే 0.59 మీటర్లు తగ్గిన వైనం



జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో భూగర్భజలాలు పడిపోతున్నాయి. అక్టోబర్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టడం.. నైరుతి రుతుపవనాలు నిష్క్రమించడంతో నీటిమట్టం తగ్గుతోంది. ప్రస్తుతం జిల్లాలో సగటున 2.89 మీటర్ల లోతులో నీరు లభ్యమవుతోంది. సెప్టెంబర్‌తో పోల్చితే అక్టోబర్‌లో 0.59 మీటర్ల మేర భూగర్భ నీటిమట్టం తగ్గింది. వ్యవసాయ బావుల్లో నీరు లోతుకు పడిపోతోంది.

కొడిమ్యాలలో భారీగా..

జిల్లాలో సగటున 2.88 మీటర్ల లోతులో భూగర్భ జలం ఉంటే.. కొడిమ్యాల మండలంలో మాత్రం అత్యధికంగా 5.63 మీటర్లకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. అత్యల్పంగా బీర్‌పూర్ మండలంలో 0.97 మీటర్లకు పడిపోయింది. మండలాల వారీగా పరిశీలిస్తూ.. బీర్‌పూర్‌లో 0.97 మీటర్లు, బుగ్గారంలో 3.20, గొల్లపల్లిలో 3.50, పెగడపల్లిలో 1.98, సారంగాపూర్‌లో 3.50, వెల్గటూర్‌లో 2.42, ఇబ్రహీంపట్నంలో 3.15, మల్లాపూర్‌లో 3.07 మీటర్ల లోతుకు భూగర్భజలం పడిపోయింది.

మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి..

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సాధారణ స్థాయి నుంచి నీటిమట్టం పడిపోతోంది. జిల్లా కేంద్రంలో 4.80 మీటర్లు, రాయికల్‌లో 1.71 మీటర్లు, కోరుట్లలో 5.51 మీటర్లు, మెట్‌పల్లిలో 3.70 మీటర్లు, ధర్మపురిలో 3.14 మీటర్లకు తగ్గిపోయింది. ఆయా మున్సిపాలిటీల్లో నీటి వాడకం ఎక్కువగా ఉండడంతో ఇతర మండలాలతో పోల్చితే భూగర్భజల మట్టం భారీగా పడిపోతూ ఉంది. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పట్టణాలకు తాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్లన్నీ నిండుకుండలా మారడంతో భూగర్భజలం పెద్దగా తగ్గినట్లు కనబడటం లేదు.

నాన్ ఆయకట్టు మండలాల్లో..

నాన్ ఆయకట్టు మండలాల్లో నీటి మట్టం కూడా తగ్గుతోంది. వర్షాలు తగ్గిపోవడం.. సాగు నీరు ఎక్కువగా వినియోగిస్తుండడంతో నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. కొడిమ్యాలలో 5.63 మీటర్లు, మల్యాలలో 2.86 మీటర్లు, భీమారంలో 2.52 మీటర్లు, కథలాపూర్‌లో 1.05 మీటర్లు, మేడిపల్లిలో 2.69 మీటర్లలో లోతులో భూగర్భజలం ఉంది.

యాసంగి పంటలకు ఉపయోగం

జిల్లాలో దాదాపు నాలుగు లక్షల ఎకరాల వరకు యాసంగి సీజన్‌లో పంటలు సాగవుతాయి. ఇందులో వరి విస్తీర్ణమే మూడు లక్షల ఎకరాలు. వరి పంటకు నీటి వినియోగం ఎక్కువ. వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల ద్వారా భూగర్భజలాలను వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో నవంబర్ నుంచి భూగర్భజలాలు మరింత లోతుకు పడిపోయే అవకాశం ఉంది. మళ్లీ వర్షాకాలం వచ్చే వరకూ ప్రస్తుతం ఉన్న నీటినే సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

నీటిమట్టం తగ్గుతోంది



వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు మెల్లిగా పడిపోతున్నాయి. యాసంగి పంటలకు మాత్రం సాగునీటికి పెద్దగా ఇబ్బంది ఏమీ ఉండదు. బావుల్లో ఉన్న నీరు సరిపోతుంది. చాలా పంటలకు డ్రిప్ ద్వారా సాగు నీరు ఇస్తున్నాం.

– కోల నారాయణ, రైతు, చల్‌గల్

పొదుపుగా వాడుకోవాలి

రుతుపవనాలు వెనక్కి తగ్గడంతో వర్షాలు తగ్గాయి. సాగు, ఇతర అవసరాలకు నీటి వినియోగం పెరగడంతో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతోంది. ఉన్న నీటితోనే వర్షాకాలం వచ్చేవరకూ నీటిని పొదుపుగా వాడుకోవాలి.

– జి.నాగరాజు, జిల్లా భూగర్భజల అధికారి



ఇప్పపల్లి శివారులో అటవీశాఖ భూమిలో తొలగించిన చెట్లు

ఈ ఫొటో మండలంలోని ఇప్పపల్లి శివారు అటవీశాఖకు చెందిన భూమి. కొందరు అక్రమంగా చెట్లను నరికివేసి చదును చేస్తున్నారు. స్థానికులు ఐదు నెలల క్రితం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇద్దామని ఫోన్ చేస్తే పని చేయలేదు. నంబర్ మనుగడలో లేదని జవాబు వచ్చింది. అక్రమాల విషయం అధికారులకు తెలుపుదామంటే ఫోన్ నంబర్ పనిచేయకపోవడంతో స్థానికులు అసంతృప్తికి లోనవుతున్నారు. అధికారుల వ్యక్తిగత నంబర్ తెలియకపోవడం.. డిపార్ట్‌మెంట్ ఇచ్చిన సిమ్ పనిచేయకపోవడంతో సమాచారం ఎలా చేరవేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నామంటున్నారు ప్రజలు. అటవీశాఖ అధికారులకు సకాలంలో సమాచారం అందితే కనీసం 20 ఎకరాల్లోని చెట్లను కాపాడినవారమయ్యేవారమని చెబుతున్నారు. ఇదీ ఒక్క ఇప్పపల్లి ప్రజలదే కాదు.. అక్రమ కలప వ్యాపారుల సమాచారం ఇద్దామనుకున్న జిల్లాలో పలువురి ఆవేదన.

మూగబోయిన అటవీశాఖ సెల్‌ఫోన్లు

- పనిచేయని డిపార్ట్‌మెంట్ సిమ్‌కార్డులు
- రీచార్జి చేయించకపోవడమే కారణం
- సమాచారం ఇచ్చేందుకు జనం ఇక్కట్లు

కథలాపూర్(వేములవాడ): అటవీశాఖ ఉద్యోగులకు డిపార్ట్‌మెంట్‌పరంగా ఇచ్చిన సిమ్‌కార్డులు మూగబోయాయి. సుమారు ఎనిమిదేళ్ల క్రితం అటవీశాఖలో బీట్ ఆఫీసర్ స్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు డిపార్ట్‌మెంట్ పరంగా ప్రత్యేకంగా కేటాయించిన సెల్‌ఫోన్ నంబర్లు పనిచేయకపోవడంతో వారు ఇబ్బందిపడుతున్నారు. దీంతో అక్రమాలు జరిగితే సమాచారం అందే పరిస్థితులు లేకుండా పోయాయి. డిపార్ట్‌మెంట్ ఇచ్చిన సిమ్‌లకు సంబంధించి ప్రతినెలా రూ.500 రీఛార్జ్‌ను ప్రభుత్వమే చేయించేది. ఈ రీచార్జ్ ప్లాన్‌లో రోజుకు 1.5 జీబీ డేటా, డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉచిత కాల్స్ చేసుకునే ప్యాకేజీలున్నాయి. ఇదంతా బాగానే ఉన్నా.. ఆరు నెలల నుంచి రీచార్జ్ చేయించకపోవడంతో అవి పనిచేయడంలేదు.

జిల్లాలో ఐదు రేంజ్‌లు.. 76 బీట్లు

జిల్లా అటవీశాఖలో మెట్‌పల్లి, రాయికల్, జగిత్యాల, ధర్మపురి, కొడిమ్యాల రేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 26 సెక్షన్లు, 76బీట్లుగా విభజించి సంబంధిత అధికారులు, సిబ్బందిని నియమించారు. జిల్లాలో 76 బీట్‌లకు గాను 37 మంది బీట్ అధికారులు, 26 సెక్షన్లకు 24 మంది సెక్షన్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు.

కొత్త అధికారులు.. పనిచేయని సిమ్‌లు

అటవీశాఖలో ఇటీవల బదిలీలు భారీగా జరిగాయి. ఆయా సెక్షన్లు, బీట్‌లలో డ్యూటీలో చేరిన అధికారులు కొత్తవారు కావడంతో అక్కడి ప్రజలకు పరిచయం కాలేదు. డిపార్ట్‌మెంట్ కేటాయించిన సెల్ నంబర్లు పనిచేయని పరిస్థితి. అడవుల్లోని కలప, ఇసుక అక్రమ రవాణా, వన్యప్రాణుల వేట తదితర వాటిపై ఎవరైనా సమాచారం ఇద్దామన్నా కుదరడం లేదు. కొత్తగా వచ్చిన అధికారుల వ్యక్తిగత సెల్ నంబర్లు తెలియక స్మగ్లర్ల కదలికలపై సమాచారం ఇవ్వలేకపోతున్నారు. ఈ వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో క్షేత్రస్థాయి ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

రీచార్జ్ చేయించడం లేదు

ఉద్యోగులకు డిపార్ట్‌మెంట్ నుంచి సిమ్‌కార్డులు ఇచ్చారు. అప్పట్లో ప్రభుత్వం ప్రతినెలా రీచార్జి బిల్లు చెల్లించేది. ఆరు నెలలుగా ప్రభుత్వం చెల్లించడంలేదు. అప్పటినుంచి డిపార్ట్‌మెంట్ సిమ్‌కార్డులు పనిచేయడం లేదు. ఉద్యోగులు సొంత సెల్ నంబర్లను వాడుతున్నారు. ప్రజలు ఏమైనా సమాచారం ఇవ్వాలనుకుంటే ఆ నంబర్లను సంప్రదించాలి.

– రవిప్రసాద్, జిల్లా అటవీశాఖ అధికారి

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

కమాన్‌పూర్(మంథని): గుండారం గ్రామానికి చెందిన నది నరేశ్(24) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. నరేశ్ శనివారం రాత్రి గ్రామ శివారులో పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌తో సమాచారం అందించగా.. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని నరేశ్‌ను పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. నరేశ్ ట్రాక్టర్, వరికోత మిషన్లపై డ్రైవర్‌గా పని చేసేవాడు. నరేశ్ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

విద్యార్థి అదృశ్యం


సాయిగణేశ్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌కు చెందిన బొమ్మెన తిరుపతి కుమారుడు సాయిగణేశ్(17) అనే ఇంటర్ విద్యార్థి శనివారం నుంచి కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం తండ్రి తిరుపతి తన కుమారుడు కన్పించడం లేదంటూ కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బొమ్మకల్ పంచాయతీ పరిధిలోని కృష్ణానగర్‌కాలనీలో బొమ్మెన తిరుపతి టీ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తిరుపతి కుమారుడు సాయిగణేశ్ కరీంనగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం కళాశాలకు పోతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయిగణేశ్ రాత్రయినా తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇంట్లో సాయిగణేశ్ ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చిందని గ్రామస్తులు తెలిపారు. నేదూరి రమేశ్, గడ్డం పుష్పవ్వ, గోపి ప్రకాశ్‌తోపాటు మరో ఇద్దరిపై దాడి చేసిందన్నారు. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): వేధింపులకు పాల్పడిన ఘటనపై గ్రామంలో పంచాయితీ చేస్తున్న క్రమంలో దాడికి పాల్పడిన ఓ వ్యక్తి, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం ఆదివారం తెలిపారు. పాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన గెల్లు మహేందర్ మూడు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్తున్న సమయంలో వేధింపులకు పాల్పడ్డాడు. భర్త, కుటుంబ సభ్యులు కలిసి గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేస్తున్న క్రమంలో వివాహిత, భర్తపై దాడికి పాల్పడ్డారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. కథలాపూర్ మండలంలోని ఓ వాగు నుంచి నిజామాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గ మధ్యంలో డిపో వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం లారీ యజమాని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. లారీ యజమానులు అనుమతులు తీసుకొని ఇసుకను తరలించాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రెండేళ్ల బాలుడి కిడ్నాప్!

- హైదరాబాద్‌లో ఆచూకీ గుర్తించిన పోలీసులు
- బెగ్గింగ్ మాఫియాకు అమ్ముతుండగా పట్టివేత

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీం'నగరం'లో రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. కిడ్నాప్‌ను సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నగరంలోని వన్‌టౌన్ పరిధిలో నివసిస్తున్న ఓ మహిళకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆమెకు బాగా సన్నిహితంగా ఉండే ఓ స్నేహితురాలు.. బాబును ఆడించినట్లు నటించి తన వెంట తీసుకెళ్లింది. తన బాబు కనబడకపోయేసరికి సదరు తల్లి తల్లడిల్లిపోయింది. చుట్టుపక్కల వెదికి.. చివరికి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితురాలు బాబుతో హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ల ఆధారంగా కిడ్నాప్ చేసిన మహిళ, బాబును గుర్తించారు. అక్కడ బాబును రూ.50వేలకు బెగ్గింగ్ మాఫియాకు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా.. ఆ ప్రయత్నాన్ని పోలీసులు సకాలంలో చేరుకుని భగ్నం చేయగలిగారు. బాబును కాపాడిన పోలీసులు.. మహిళను అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం సదరు కిడ్నాప్ ఘటన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది. 2022 ఆగస్టులో అశోక్‌నగర్‌కి చెందిన ఓ బాలికను ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేయగా వన్‌టౌన్ పోలీసులు 24 గంటల్లో పాప ఆచూకీ కనిపెట్టారు. 2023 ఫిబ్రవరిలోనూ టూటౌన్ పరిధికి చెందిన ఓ మహిళ తన పొరుగింట్లో ఉండే ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి మహారాష్ట్ర తీసుకువెళ్లిన ఘటన అప్పట్లో కలకలం రేపిన విషయం తెలిసిందే.

కేంద్రాలు సరే.. కొనుగోళ్లేవి?

- జాప్యాన్ని నిరసిస్తూ పార్లమెంట్ పరిధిలో నిరసనలు
- నేడు తహసీల్దార్లకు వినతిపత్రాలు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా నేటికీ వడ్ల కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం బాధాకరమని, ఈ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, ఆచరణకు పొంతనే లేకుండా పోయిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,572 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం వాటిలో ఇప్పటికే 4,598 కేంద్రాలను తెరిచినట్లు పేర్కొందని, కానీ తమకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క కేంద్రంలోనూ ఇంతవరకు వడ్ల కొనుగోలు ప్రారంభమే కాలేదన్నారు. వడ్ల కుప్పలతో కేంద్రాలన్నీ నిండిపోవడంతో స్థలం లేక ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోడ్లపై రాశులుగా పోస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడ్లు తడిసిపోయాయని, చాలా చోట్ల కోతకు వచ్చిన పంట నీటిపాలైందన్నారు. తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా తడిసిన ప్రతీ గింజను కొనాలన్నారు. అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతుల పక్షాన త్వరలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. అందులో భాగంగా బీజేపీ శ్రేణులు సోమవారం అన్ని మండల కార్యాలయాలకు వెళ్లి తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

జువ్వాడి సూర్యారావుకు కన్నీటి వీడ్కోలు


తిమ్మాపూర్‌లో సూర్యారావు అంత్యక్రియల్లో విప్ అడ్లూరి


సూర్యారావు మృతదేహం వద్ద భార్య, కూతుళ్లు

ధర్మపురి: దివంగత జువ్వాడి రత్నాకర్‌రావు సోదరుడు జువ్వాడి సూర్యారావు మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా.. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన మండలంలోని తిమ్మాపూర్‌కు తీసుకొచ్చారు. అంతిమయాత్రలో ప్రభుత్వ విప్, వందలాది మంది పాల్గొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు తదితరులు పాల్గొన్నారు. సూర్యారావుకు యనకు భార్య భారతి, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

సూర్యారావు కూతురు హైకోర్టు జడ్జి

సూర్యారావు నలుగురు కూతుళ్లలో పెద్ద కూతురు శ్రీదేవి ప్రస్తుతం హైకోర్టు జడ్జి. రెండో కూతురు శ్రీలత, మూడో కూతురు శ్రీకుమారి, నాలుగో కూతురు శిరీష. హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న పెద్ద కూతురు శ్రీదేవి తండ్రికి తలకొరివి పెట్టడం అందరిని కలచివేసింది. తండ్రి మరణంతో కూతుళ్లు శోకసంద్రంలో మునిగారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ప్రచారం చేస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని గిద్దెపెరుమాండ్లస్వామి ఆలయ మైదానంలో వాకర్స్‌తో, జిల్లా గ్రంథాలయంలో పట్టభద్రులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సమాయత్తమవుతున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అల్ఫోర్స్ పక్షాన ఉచిత యాప్ అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6 లోపు తమ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ వరకు ప్రాంతీయ క్రీడా పాఠశాల

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి


మాట్లాడుతున్న శివసేనారెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను వచ్చే సంవత్సరం నాటికి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తానని, పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే ఉండి క్రీడల్లో రాణించి దేశానికి పతకాలు అందించే క్రీడాకారులుగా తయారు కావాలని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులకు సూచించారు. ఆదివారం రాత్రి ఆయన ఆకస్మికంగా క్రీడా పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులు, గ్రంథాలయం గది పరిశీలించారు. బాక్సింగ్, జూడో, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ ట్రాక్, విద్యార్థుల హాస్టల్ గదులను చూశారు. విద్యార్థులు ఆయా క్రీడల్లో తీసుకుంటున్న శిక్షణను కోచ్‌లనడిగి తెలుసుకున్నారు. శిక్షణ ఎలా పొందుతున్నారో విద్యార్థులను అడిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారు గొప్ప స్టార్లుగా ఎదుగుతారన్నారు. హకీంపేట స్కూల్ తరహా మీకు కూడా అన్ని సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు పవన్, సాయిరాం, శ్యామ్, చందు, సంపత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జాప శ్రావణ్‌రెడ్డి, కిమ్ ఫహాద్, గట్టు ప్రశాంత్, ఆకుల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్


సెల్ టవర్ ఎక్కిన రాకేశ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని సెల్ టవర్‌పైకి పెద్దపల్లి మండలం రాఘవపూర్‌కు చెందిన ఇంజాల రాకేశ్ ఆదివారం ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. రాకేశ్ తన గ్రామంలో కొందరితో ప్రాణభయం ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదని మానస్తాపం చెంది సెల్ టవర్ ఎక్కాడు. దాదాపు రెండు గంటలపాటు హైడ్రామా సృష్టించగా.. ఎస్సై, సీఐ సుబ్బారెడ్డి, బాధితుడి కుటుంబ సభ్యులు నచ్చజెప్పారు. కిందకు దిగగా.. పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

జగిత్యాలక్రైం: గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం జగిత్యాల పట్టణంలోని రాజీవ్ బైపాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టగా.. అనుమానాస్పదంగా స్కూటీపై వెళ్తున్న యువకులను తనిఖీ చేస్తే గంజాయి లభించిందన్నారు. జగిత్యాల రూరల్ మండలం బాలెపల్లి గ్రామానికి చెందిన జక్కుల మధు, పెగడపల్లి మండలం వెంగళాయపేటకు చెందిన రాచర్ల వంశీ, పాలకుర్తి మండలం కుక్కలగూడురుకు చెందిన నలిమెల వినోద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకొచ్చి జగిత్యాలలో యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్నారు. వంశీపై గతంలో రెండు గంజాయి కేసులు నమోదయ్యాయని, వినోద్‌పై ఏడు కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయని అన్నారు. ఎస్సై మన్మథరావు, కిరణ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పత్తి తూకంలో మోసం


వాహనాన్ని పట్టుకున్న గ్రామస్తులు, రైతులు

ధర్మపురి: పత్తి తూకంలో మోసం చేసి పారిపోతున్న దళారులను గ్రామస్తులు, రైతులు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. తుమ్మెనాల గ్రామానికి చెందిన అప్పాల మల్లయ్య పత్తిని ఆదివారం పత్తి దళారులు ఎలక్ట్రానిక్ కాంటాలో తూకం వేశారు. రైతు నుంచి కొనుగోలు చేసిన పత్తి 5క్వింటాళ్ల12కిలోలని చూపించారు. కాని రైతు అంతకుముందే ఇంటి వద్ద తూకం వేసుకోగా.. 6క్వింటాళ్ల77కిలోలు ఉంది. 165 కిలోల పత్తి తక్కువగా వచ్చింది. పసిగట్టిన రైతు దళారిని ప్రశ్నించే లోగా వ్యాన్‌తోపాటు పరారయ్యాడు. గ్రామస్తులు, రైతులు వ్యానును వెంబడించి గ్రామ శివారులో పట్టుకొని డ్రైవర్‌తోపాటు కూలీలను పోలీసులకు అప్పజెప్పారు. పత్తి వ్యానును పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ముందుగానే తూకం వేసుకొని విక్రయించడానికి సిద్ధంగా ఉండాలని పోలీసులు సూచించారు.

రైల్వే స్టేషన్‌లో అంధకారం


కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో చీకట్లో ప్రయాణికులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో అధికారుల నిర్లక్ష్యంతో అంధకారం నెలకొంది. ఆదివారం రాత్రి 7 గంటలకు తిరుపతికి వెళ్లాల్సిన ప్రయాణికులు చీకట్లో పడరాని పాట్లు పడ్డారు. ప్లాట్‌ఫారంపై కేవలం ఒక్కటే ఫ్లడ్ లైట్ ఉండటంతో దూరంగా ఉన్న రైలును ఎక్కేందుకు చీకటి ఉండటంతో కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమృత్‌మాల పథకంలో భాగంగా కరీంనగర్ రైల్వే స్టే షన్ ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యుదీకరణ పనులు నడుస్తున్నాయనే సాకుతో అధికారులు స్టేషన్‌లో విద్యుత్ లైట్లను ఆన్ చేయకపోవడంతో రాత్రంతా చీకటిగానే ఉంటోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నెల రోజుల నుంచి స్టేషన్ ప్రాంగణమంతా చీకట్లోనే ఉంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు


యమధర్మరాజుకు పూజలు చేస్తున్న అర్చకుడు

ధర్మపురి: ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదని వేద పండితుడు బొజ్జ రమేశ్‌శర్మ పేర్కొన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో ఆదివారం యమ ద్వితీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం హారతి, మంత్రపుష్పము తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ, ప్రపంచంలో యమ ధర్మరాజు ఆలయం ఒక్క ధర్మపురిలోనే ఉందని, ప్రతీ నెల భరణి నక్షత్రము, ఏటా యమ ద్వితీయ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

6 గంటలు.. 72 పాటలు

- ఐదు బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పిన సింగర్ సల్వాజీ సంధ్య


రికార్డు అందుకుంటున్న సల్వాజీ సంధ్య దంపతులు

కరీంనగర్‌కల్చరల్: ఆరు గంటలపాటు నిర్విరామంగా 72 పాటలు పాడి ఐదు బుక్ ఆఫ్ రికార్డులు నెలకొల్పింది కరీంనగర్‌కు చెందిన గాయనీ సల్వాజీ సంధ్య. కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో ఆదివారం సల్వాజీ ప్రవీణ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగర్ సల్వాజీ సంధ్య ఆరు గంటల పాటు 72 పాటలు పాడి ఐదు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లు నెలకొల్పింది. భరత్ వరల్డ్ రికార్డు, సింగర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డు, కల్చరల్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌లో చోటు సంపాదించింది. వరల్డ్ రికార్డ్ కో– ఆర్డినేటర్ కేవీ.రమణరావు పర్యవేక్షణలో ఎనిమిది మంది వాయిద్యా కళాకారుల సాయంతో సంధ్య ప్రముఖ గాయని కే.ఎస్.చిత్ర పాటలను పాడింది. ఆర్.అనిల్, ఎం.ప్రశాంత్, ఎస్.మహేందర్, కె.వినోద్, సతీశ్, సాయి, సత్యం, మల్లేశ్ సంగీత సహకారం అందించారు. ఈ సందర్భంగా సంధ్యను గాయకులు, అధికారులు, కళాకారులు అభినందించారు. ఆర్డీవో మహేశ్వర్, కేఎస్.అనంతచార్య, జి.కృపాదానం, వి.గోపాల్‌రావు, సల్వాజి ప్రవీణ్ పాల్గొన్నారు.

చిన్నారి బతుకు పోరాటం

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు


దాతలు ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటున్న చిన్నారి అనన్య

ఫోన్ పే నంబర్: 9963663653

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తోటి పిల్లలతో ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన ఓ చిన్నారి నాలుగేళ్ల వయస్సులోనే బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. తనకు వైద్య చికిత్స కోసం దాతలు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటోంది. కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన తాళ్లపల్లి అనూష–ప్రశాంత్ కూతురు అనన్యను బ్లడ్ క్యాన్సర్ వేధిస్తోంది. వైద్యం కోసం అనన్య తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. రూ.10లక్షలు చెల్లిస్తేనే వైద్యం అందిస్తామని వైద్యులు పేర్కొన్నారు. డబ్బుల్లేని ఆ నిరుపేద కుటుంబం దాతలు సాయం చేయాలని వేడుకుంటోంది.

చదువుకోవాలని ఉంది.. సాయం చేయండి

మేడిపల్లి(జగిత్యాల): చదువుల తల్లికి విద్య కొనలేని ఆపదొచ్చింది. సోషల్ మీడియా వేదికగా చదువుకోవాలని ఉంది.. సాయం చేయండని ఓ నిరుపేద విద్యార్థిని పోస్ట్ చేయడం స్థానికంగా చర్చకు దారి తీసింది. కాచారం గ్రామానికి చెందిన న్యాత అక్షయ తన కుటుంబ పరిస్థితిని వివరిస్తూ.. తనకు ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చిందని, బీఎస్సీ నర్సింగ్ ఆసిఫాబాద్‌లో సీటు వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం ఎంట్రెన్స్ ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నానని, దాతలు సాయం చేయాలని కోరింది. అక్షయ తల్లి చిన్నతనంలోనే చనిపోయిందని, తండ్రి కంటిచూపు సరిగా లేక ఇంటిపట్టునే ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. అక్షయ ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుందని, దాతలు సాయం చేస్తే తన భవిష్యత్తు బాగుంటుందన్నారు. సాయం చేసేవారు కింది నంబర్లకు పంపించాలని వారు కోరుతున్నారు.

ఫోన్ పే, గూగుల్ పే
న్యాత రాజం 9121349332,
బర్ల అనుదీప్ 8497950725


సోషల్ మీడియాలో సర్టిఫికెట్లు చూపుతున్న అక్షయ

'రాజన్న'కు భక్తుల రద్దీ







వేములవాడఅర్బన్: కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో ఆదివారం భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి పవిత్రమైన ధర్మగుండంలో స్నానాలాచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు.